ప్రజాశక్తి

సోమవారం 7 ఏప్రిల్ 2025

పింఛను మంజూరు చేయరూ...

- 70 ఏళ్ల వృద్ధురాలు వేడుకోలు

ప్రజాశక్తి-గూడెంకొత్తవీధి: మండలంలోని రింతాడ పంచాయతీ సచివాలయం2 పరిధిలోని గొడిసింత సమీపం సువ్వపల్లి గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు పింఛను మంజూరు చేయాలని వేడుకోంది. ఈ మేరకు ఆమె విలేకర్లకు తన గోడును వెల్లదీసుకుంది. గ్రామానికి చెందిన గెమ్మేల గున్నమ్మకు (70 సంవత్సరాలు). ఆధార్ కార్డులో మాత్రం 41 సంవత్సరాలుగా ఉండటంతో పింఛను మంజూరు కాలేదు. దీంతో వృద్ధురాలి తీవ్ర మనోవేదనకు గురవుతూ ఇబ్బందులు ఎదుర్కొంటుంది. అధికారులు తక్షణమే స్పందించి గున్నమ్మకు పింఛను మంజూరు చేయాలని గ్రామస్తులు తెలిపారు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న వృద్ధురాలు

తాగునీటి సౌకర్యం కల్పించాలి

- ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మహిళల నిరసన

ఆందోళన చేపడుతున్న నాయకులు, గిరిజన మహిళలు

ప్రజాశక్తిఅరకులోయ రూరల్: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకువేలి మండలం సుంకరమెట్ట పంచాయతీ కిన్నంగుడ గ్రామంలో తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మహిళాలు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు, సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెల చిన్నబాబు మాట్లాడుతూ, కిన్నంగుడ గ్రామంలో తాగు నీటి సౌకర్యం కల్పించుటకు గతంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ 18 లక్షలతో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా మంజూరైందని, టెండర్ పూర్తయి ప్రభుత్వం నుండి ఆమోదం రాకపోవడంతో గుత్తేదారుడు పనులు ప్రారంభం చేయలేదని తెలిపారు. ప్రస్తుతం వేసవి కాలం రావడంతో తాగు నీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నాబార్డ్ వాటర్ స్కీం ద్వారా వేసిన పైపు లైన్‌కు కిన్నంగుడా గ్రామంలో ట్యాంక్ లేనందున కనెక్షన్ ఇవ్వలేదని, దీంతో తాగునీరుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గ్రామంలో ఈ ఎండ తీవ్రతకు ఊట గెడ్డలు ఇంకిపోయి గుక్కెడు నీరు దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని నాబార్డ్ వాటర్ స్కీమ్ ద్వారా వేసిన పైపు లైన్‌కు గ్రామంలో ట్యాంక్ నిర్మించి ప్రతి గడప గడపకు కుళాయి ట్యాప్ ఏర్పాటు చేసి దాని ద్వారా తాగు నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ కుమిడీ రాము, కొర్ర కొములు, డి.కల్యాణ్ కుమార్, వి మదన్, కొర్ర సురేష్, మొత్తి, మహిళాలు తదితరులు పాల్గొన్నారు.

సభా వేదిక వద్ద ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

పవన్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈనెల 7న డుంబ్రిగుడ పర్యటనలో బాగంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. చాపరాయి జలపాతం లో ముత్యాలమ్మను దర్శించనున్నారు. అనంతరం గెడ్డ మీదుగా పీవిటీజీ గ్రామం పెదపాడుకు చేరుకుంటారు. పీఎం జన్మన్ గృహ నిర్మాణాలను పరిశీలించనున్నారు. గ్రామస్థులతో ముఖాముఖీగా మాట్లాడతారు. అక్కడి నుంచి మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో చేరుకుని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. పవన్ పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ అబిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ పర్యవేక్షిస్తూ ముమ్మర ఏర్పాట్లను చేస్తున్నారు. చాపరాయి, పెదపాడు, సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. సభా ప్రాంగణంలో ఎనిమిది వేల మంది కూర్చునేలా చర్యలు చేపడుతున్నారు. గట్టి భద్రత మధ్య పర్యటన కొనసాగనుంది.

ఈదురుగాలులతో వర్ష బీభత్సం

- జీడి, మామిడి పంటలకు తీవ్ర నష్టం
- వేసవి ఉక్కపోత నుంచి ఉపశమనం

రాజవొమ్మంగి మండలం లోదొడ్డిలో ఈదురుగాలులతో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని లోదొడ్డి, వాతంగి తదితర గ్రామాల్లో :ఆదివారం సాయంత్రం ఈదురు గాలులలు, ఉరుములు మెరుపులు పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. పగలంతా మండిపోయేలా ఎండలు కాచినా, సాయంత్రానికి ఒక్కసారిగా ఆకాశంలో కారుమబ్బులకు కమ్ముకొని భారీ ఈదురుగాలులతో కూడిన వర్ష బీభత్సం సృష్టించింది. తోటల్లోని మామిడి, జీడి మామిడి కాయలు నేలరాలిపోవడంతో భారీ నష్టమే జరిగింది. బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరుతున్నారు.

పాడేరు టౌన్: మన్యంలో ఆదివారం ఉదయం పొగమంచు, మధ్యాహ్నం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో ఏజెన్సీ ప్రాంతంలో వాతావరణం చల్లబడింది. జిల్లా కేంద్రం పాడేరు మొదలుకుని ఏజెన్సీలోని ఆయా ప్రాంతంల్లోనూ ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పాడేరులో తెల్లవారు జాము నుంచి ఉదయం 8 గంటల వరకు పొగమంచు కురిసింది. తర్వాత నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఆకాశం మేఘావృతమై ఎండ పెద్దగా కాయలేదు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత గంట సేపు వర్షం కురిసింది. వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. వర్షంతో రోడ్లన్నీ చిత్తడిగా మారింది

పాస్‌పోర్టు సేవా కేంద్రంతో యువతకు మేలు

- ప్రజాశక్తితో పాస్‌పోర్టు సేవా కేంద్రం వెరిఫికేషన్ అధికారి జి.శ్రీనివాస్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో పార్లమెంటు నియోజకవర్గ కేంద్రమైన అరకు లోయలో భారత ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన పోస్ట్ ఆఫీస్, పాస్ పోర్టు సేవా కేంద్రం సేవలను గిరిజన యువత ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సేవా కేంద్రం వెరిఫికేషన్ ఆఫీసర్ జి శ్రీనివాస్ కుమార్ సూచించారు. విద్యా ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం విదేశాలకు వెళ్ళదలిచినవారు సత్వరమే పాస్పోర్ట్ పొందడానికి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం షెడ్యూల్డ్ గిరిజన ప్రాంతంలో ఈ పాస్పోర్ట్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ ఏడాది జనవరి 22న అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ గుమ్మ తనుజ రాణి ప్రారంభించిన ఈ పాస్పోర్ట్ సేవా కేంద్రం విశాఖపట్నం రీజినల్ పాస్పోర్ట్ అధికారి విశ్వాంజలి గైక్వాడ్ ఆధ్వర్యంలో పని చేస్తుందని తెలిపారు. అరకు లోయలో కొత్తగా ఏర్పడిన ఈ సేవా కేంద్రం ద్వారా పాస్పోర్ట్ పొందగోరే గోరేవారు దరఖాస్తు చేసుకునే సౌలభ్యం కోసం ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు వివరాలను తెలియజేశారు..

దరఖాస్తు చేసుకునే విధానం?

ఆన్లైన్ ద్వారా పాస్పోర్ట్ ఇండియా డాట్ జి ఓ వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో న్యూ యూజర్ ఎంపిక చేసుకుని లాగిన్ ఐడి, పాస్వర్డ్, రూపొందించు కోవాలి. దరఖాస్తు ఫామ్ భర్తీ చేసి అల్లూరి సీతారామరాజు జిల్లా ఎంపిక చేసుకోవాలి. పాస్పోర్ట్ పొందగోరే అభ్యర్థి పూర్తి సమాచారం వివరాలను పొందుపరచాలి.

అవసరమైన ధ్రువ పత్రాలు?

అభ్యర్థి ప్రాంతం/ చిరునామా, వివరాలు తెలిపే ధ్రువపత్రాలను జత పరచాలి. ఆధార్ కార్డు, లేదా ఓటరు ఐడి, బ్యాంక్ పాస్, బుక్ లేదా గ్యాస్ కనెక్షన్ బాండ్, వాటర్ టాక్స్ బిల్లు, పుట్టిన తేదీ/ జనన ధ్రువీకరణ కోసం ఎస్ఎస్సి మార్క్స్ మెమో లేదా డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు ఐడి, పెన్షనర్లు అయితే పెన్షన్ ఆర్డర్ కాపీని లేదా ఇన్సూరెన్స్ పాలసీ బాండ్ గాని జత చేయాలి.

ఫీజు వివరాలు?

పాస్పోర్ట్ పొందడానికి దరఖాస్తు చేసుకునే సమయంలోనే అభ్యర్థులు ఫీజు రుసుము రూ.1500 ఆన్లైన్ ద్వారా చెల్లింపు చేయాలి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల వివరాలపై పోలీస్ అధికారుల పరిశీలన ప్రక్రియ అరకులోయ పాస్పోర్ట్ సేవా కేంద్రానికి నిర్ణీత తేదీలో అభ్యర్థి వచ్చి సంతకం వేలిముద్రల స్వీకరణ పూర్తయ్యాక పాస్పోర్టు జారీ ప్రక్రియ పూర్తవుతుంది. ఒకసారి పాస్పోర్ట్ పొందిన తర్వాత వాలిడిటీ ఉన్న కాలంలో పాస్పోర్ట్ను పోగొట్టుకున్న డ్యామేజ్ అయిన రీ ఇష్యూ కోసం మూడు వేల రూపాయల ఫీజు తో పాటు పోలీస్ శాఖ ద్వారా నాట్ ట్రేస్బుల్ సర్టిఫికేట్ కూడా జతపరిచి తిరిగి పాస్పోర్ట్ పొందవలసి ఉంటుందని తెలిపారు. అల్లూరి జిల్లాలోని అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రజలు ఈ పాస్పోర్ట్ సేవా కేంద్రం సేవలను సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకోరా?

- బస్సు ప్రమాదంలో కూలిన వంతెన రైలింగ్
- నెలల తరబడి నిర్లక్ష్యంగా వదిలేసిన అధికారులు
- తాత్కాలిక కర్రల గోడ నిర్మించిన యువకులు

గిరియువకులు కర్రలతో నిర్మిస్తున్న రక్షణ కంచె

ప్రజాశక్తి.-రాజవొమ్మంగి: మండలంలోని బోర్నగూడెం గ్రామ శివారు ప్రాంతంలో వాగుపై వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు కూలి ప్రమాద భరితంగా ఉన్నా అధికారులు, నేతలు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని నెలల క్రితం జరిగిన బస్సు ప్రమాదంలో వంతెన రైలింగ్ మొత్తం పాడైపోయింది. అప్పట్లో రైలింగ్ ఉండడం వల్లే భారీ ప్రమాదం జరిగినా ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే కూలిన రైలింగ్ పునరుద్ధరణ, మరమ్మతులకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో వాగుపై నున్న ఈ వంతెన వద్ద ప్రమాదం పొంచి ఉందని స్థానికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడకు వచ్చేసరికి వాహనాలను మరింత జాగ్రత్తగా, అప్రమత్తంగానడిపి, వంతెన దాటాక హమ్మయ్య అని ఊపిరిపీల్చుకునే పరిస్థితి ఉంది.

ఇంతటి ప్రమాదభరితమైన వంతెన వద్ద రైలింగ్ కూలిపోవడంతో స్థానికులు, వాహనదారులు అనేకసార్లు అధికారులకు మొరపెట్టుకుని బాగుచేయాలని కోరారు. అయితే ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ నేపథ్యంలో స్థానిక గిరిజన యువత ముందుకు వచ్చి, బోర్నపాలెం వాగుపై వంతెన వద్ద కర్రలతో తాత్కాలిక రైలింగ్ ఏర్పాటు చేసారు. దీనివల్ల ప్రమాదం పూర్తిగా నియంత్రించలేకపోయినా, ఇక్కడకువచ్చేసరికి వాహనదారులకు అప్రమత్తంగా ఉంటుందని వంతెనపై కర్రలతో రక్షణగోడ ఏర్పాటు చేశామని యువకులు, అంటున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వంతెన వద్ద కూలిన రైలింగ్‌స్థానే రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

పారదర్శకంగా టెన్త్ మూల్యాంకనం

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: ఇటీవల జరిగిన పదవ తరగతి, ఓపెన్ స్కూల్ పదవ తరగతి పరీక్షలు జిల్లాలో అత్యంత పకడ్బందీగా జరిగిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో వివిధ జిల్లాలకు చెందిన ఐదు సబ్జక్టుల మూల్యాంకనం స్థానిక తలారిసింగి గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో ఈ నెల మూడవ తేదీ నుండి మూల్యాంకనం జరుగుతోంది. ఆదివారం జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ మూల్యాంకన కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి మూల్యాంకనం జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎటువంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా, పకడ్బందీగా పరీక్షలు నిర్వహించడం జరిగిందని, అదేవిధంగా మూల్యాంకనం కూడా పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా కేంద్రంలో గదులలో లైటింగ్, తాగు నీరు, ఇతర సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్త పరిచారు. విధ్యుత్ అంతరాయం లేకుండా ఏర్పాటు చేసిన జనరేటర్ పరిశీలించారు. సుమారు 650 మంది ఉపాధ్యాయులు మూల్యాంకనంలో పాల్గొన్నారని, రేపటితో ఓపెన్ స్కూల్ పరీక్షల మూల్యాంకనం పూర్తవుతుందని, రెగ్యులర్ పదవ తరగతి మూల్యాంకనం మరో మూడు రోజుల పాటు జరుగుతుందని డిఇఓ కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో డిఇఓ పి.బ్రహ్మాజీరావు, పరీక్షల సహాయ కమిషనర్ శశిభూషణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలతో గిరిజనులు సతమతం

ప్రజాశక్తి -అనంతగిరి: విష జ్వరాలతో బాధపడుతున్న రోగులకు సకాలంలో సరైన వైద్య సేవలు అందక మంచం పట్టారు. మండలంలోని మారుమూల పెద్దకోట పంచాయతీ పరిధి మడ్రెబు గ్రామంలో గత మూడు రోజులుగా ఇంటింటా విష జ్వరాలతో బాధ పడుతున్నారు. స్థానిక ఆశా కార్యకర్త మందులు ఇచ్చినప్పటికీ తగ్గుముఖం పట్ట లేదని, తక్షణమే తమ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్య సేవలు అందించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు ఆసుపత్రికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేక అంబులెన్స్ రాని పరిస్థితిలో డోలి సహాయంతో కొండ కోనలు నడుమ కిలోమీటర్ దూరంలో ఉన్న పిన్నకోట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళవలసి వస్తుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక వైద్య సిబ్బంది గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

జ్వరంతో బాధపడుతున్న చిన్నారి

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: స్థానిక నూకాలమ్మతల్లి గుడి వెనుక వీధిలో ముసలిబాబు అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 11 బస్తాల్లోని 500 కేజీల రేషన్ బియ్యాన్ని ఆదివారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. పక్కాగా అందిన సమాచారం మేరకు స్థానిక తాహాశీల్దార్ అల్లు సత్యనారాయణ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది దాడులు నిర్వహించి, అక్రమంగా నిల్వ ఉంచిన .బియ్యాన్ని గుర్తించి, పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తిపై 6ఎ కేసు నమోదు చేసినట్లు తాహాశీల్దార్ సత్యనారాయణ తెలిపారు. పేద ప్రజలకు అందవలసిన రేషన్ బియ్యాన్ని ఎవరైనా అక్రమంగా విక్రయించినా, రవాణా చేసినా వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.. కార్యక్రమంలో విఆర్ఓ సూర్యకాంతం పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు

పాలగెడ్డ రోడ్డు పనులు జరిగేనా?

- నిధులు మంజూరైనా నిర్మాణంలో జాప్యం
- ఆది నుంచి అన్నీ అడ్డంకులతో సాగని పనులు
- అవస్థలు పడుతున్న అంతర రాష్ట్ర ప్రయాణికులు
- డిప్యూటీ సిఎం పవన్ పర్యటనపైనే గిరిజనం ఆశలు

'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందాన తయారైంది ఆర్‌వి.నగర్, పాలగెడ్డ రహదారి దుస్థితి. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు నిర్మాణానికి పదేళ్ల క్రితమే, అప్పటి టిడిపి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, టెండర్లు పిలిచి, కాంట్రాక్టు ఖరారుచేసింది. అయితే అటవీశాఖ అభ్యంతరంతో పనులు జరగ లేదు. వైసిపి అధికారంలోకి వచ్చాక ఆ నిధులను వేరే పనులకు మళ్లించడంతో పనులు జరగలేదు. తర్వాత అల్లూరి జిల్లా తొలి కలెక్టర్‌గా వచ్చిన సుమిత్‌కుమార్ ప్రత్యేక శ్రద్ధతో రోడ్డు పనులకు పూనుకోగా, పూర్తికాకుండానే ఆయన బదిలీ కావడంతో మళ్లీ మొదటికొచ్చింది. గతేడాది వర్ష బీభత్సానికి రోడ్డంతా రూపుకోల్పోని, ప్రయాణకష్టాలు మరింత ఎక్కువయ్యాయి. ప్రస్తుతం రూ.46కోట్ల తుపాన్ నిధులు మంజూరుకాగా, జనవరిలో చేపట్టాల్సిన పనులు జాప్యం జరుగుతుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రెండురోజుల జిల్లా పర్యటనకు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ వస్తుండడం, రోడ్ల అభివృద్ధిపైనే ఆయన ప్రత్యేక దృష్టి పెట్టడంతో, ఈ సారైనా పాలగెడ్డ రోడ్డుకు మోక్షం కలుగుతుందని స్థానికులు ఆశగా చూస్తున్నారు.

ప్రజాశక్తి - సీలేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం ఆర్‌వి నగర్ నుంచి పాలగడ్డ వరకు అంతరరాష్ట్ర రహదారి అడుగడుగునా పెద్దపెద్ద గోతులమయంతో అధ్వానంగా ఉంది. 2014-19లో ఆర్ వి నగర్ నుంచి పాలగెడ్డ వరకు 78 కిలోమీటర్ల రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరించడానికి అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రూ.84 కోట్లు మంజూరు చేసి, టెండర్లు పిలిచి, కాంట్రాక్ట్ ఖరారు చేసింది. అయితే రోడ్డు విస్తరణ పనులకు అటవీ శాఖ అభ్యంతరాలతో ముందుకు సాగలేదు. 2019లో వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రహదారికి మంజూరైన నిధులను వేరే పనులకు మళ్లించారు. రహదారి సక్రమంగా లేకపోవడంతో మూడు నెలల క్రితమే విశాఖపట్నం భద్రాచలం వెళ్లే నైట్‌సర్వీస్ బస్సును ఒకదాన్ని ఆర్టీసీ అధికారులు రద్దుచేశారు. దీంతో ఈ ప్రాంతీయుల ప్రయాణకష్టాలు మరింత ఎక్కువయ్యాయి.

లంకపాకల వద్ద మట్టిరోడ్డును తలపిస్తున్న అంతర రాష్ట్ర ఆర్‌అండ్‌బి రహదారి

అల్లూరి తొలి కలెక్టర్ చొరవతో పనుల్లో కదలిక

నూతనంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పడిన తర్వాత అప్పటి కలెక్ట్ సుమిత్‌కుమార్ సప్పర్ల రెయిన్‌గేజ్ నుంచి నూతిబంధం వరకు సింగల్ లైన్ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. రెండో దశ నిర్మాణంలో భాగంగా నూతి బంధం నుంచి ఆర్‌వి.నగర్ వరకు పనులు చేపట్టడానికి అంచనా ప్రతిపాదనలు తయారు చేయాలని ఆర్‌అండ్‌బి అధికారులు ఆదేశించారు. ఈలోగా ఆయనకు బదిలీ కావడంతోపనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.



నిండా గోతులమయంగా పాలగడ్డ రహదారి

వర్షబీభత్సంతో రూపుకోల్పోయిన రోడ్డు

గతేడాది సెప్టెంబర్ 8న తుఫాన్ కారణంగా వర్షం, వరద బీభత్సవంతో ఈ రహదారి పూర్తిగా కొట్టుకు పోయింది. లంకపాకల నుంచి సీలేరు వరకు రహదారికి అడ్డంగా బండరాళ్లు, భారీ వృక్షాలు, మట్టిదిబ్బలు వరద నీటి ప్రవాహానికి రహదారిపై కొట్టుకొచ్చి అస్తవ్యస్తంగా తయారయింది. 20 రోజులకు పైగా రాకపోకలు స్తంభించిపోయి ప్రజలు నానా అవస్థలు గురయ్యారు. అప్పటి కలెక్టర్ సుమిత్‌కుమార్, పిఓ అభిషేక్ యుద్ధ ప్రాతిపదికన రహదారి పనులకు చర్యలు చేపట్టి రాకపోకలు పునరుద్ధరించారు. అయితే రోడ్డు పునర్మిర్మాణం, పటిష్టపరిచే పనులు జరగకపోవడంతో నానాటికీ రోడ్డు మరింత అధ్వానంగా మారి ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేస్తోంది. దీంతో ఆర్‌అండ్‌బి అధికారుల నివేదిక మేరకు గత డిసెంబర్‌లో ఆ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఆర్ వి నగర్ నుంచి పాలగెడ్డ వరకు గల రహదారిని స్వయంగా పరిశీలించారు.

తుపాన్ సహాయక నిధులు మంజూరు

రహదారి నిర్మాణ పనులకు ప్రభుత్వం నిధులు కేటాయించినా, పనులు చేపట్టలేదు: తుఫాన్ సహాయక నిధులు కింద అల్లూరి సీతారామరాజు జిల్లాకు రూ.46 కోట్లు ప్రభుత్వం మంజూరు చేస్తే అందులో రూ.23 కోట్లు ఆర్‌వి. నగర్ నుంచి పాలగెడ్డ వరకు రహదారి పనులకు కేటాయించామని కలెక్టర్ వెల్లడించారు. ఈ ఏడాది జనవరిలో ఆర్‌వి నగర్ నుంచి నూతిబంద వరకు, అదేవిధంగా సీలేరు నుంచి పాలగెడ్డ వరకు గల రహదారి పనులు నిర్వహించడానికి టెండర్లు ప్రక్రియ పూర్తయిందని ఆర్‌అండ్‌బి అధికారులు ప్రకటించారు. అయితే ఇప్పటివరకు పనుల్లో ఎటువంటి కదలిక లేదు.

ప్రస్తుతం ఆర్‌వి నగర్ నుంచి నూతి బంద్ వరకు, సప్పర్ల రేయిన్‌గేజ్ దిగువ నుంచి దారాలమ్మ ఆలయం, దార్ల గొంది నుంచి సీలేరు, దుప్పిలివాడ సీలేరు పాలగెడ్డ వరకు దాదాపు 25 కిలోమీటర్లు రహదారి పెద్ద గోతులతో పూర్తిగా ధ్వంసం అయింది. కొన్నిచోట్ల రహదారి ఉందా లేదా అన్న అనుమానం కలిగేలా మట్టిరోడ్డును తలపిస్తోంది. ఈ మార్గంలో ప్రయాణమంటే వాహనచోదకులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ముందుకు సాగాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

నేడు మంత్రి సంధ్యారాణి పర్యటన

ప్రజాశక్తి-పాడేరు : రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మాత్యులు, జిల్లా ఇన్చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఈనెల 7న తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు డుంబ్రిగూడ చేరుకుని ఉప ముఖ్యమంత్రి పర్యటనలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు మహా సూర్యవందనం కార్యక్రమంలో పాల్గొని తిరిగి సాలూరు బయలుదేరి వెళ్తారు.

నేడు చాపరాయి ప్రవేశం రద్దు

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: ఈనెల 7న పర్యటక కేంద్రం చాపరాయి జలపాతంలో పర్యాటకుల ప్రవేశం రద్దు చేస్తున్నట్లు ఐటిడిఏ ఇన్చార్జ్ పిఓ, జాయింట్ కలెక్టర్ వి అభిషేక్ గౌడ్ తెలిపారు. కొన్ని అనివార్య కారణాలతో ప్రవేశం రద్దు చేస్తున్నట్లు చెప్పారు. పర్యాటకులు దీన్ని గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు అనంతగిరి వారపు సంత రద్దు

ప్రజాశక్తి -అనంతగిరి: అనంతగిరి మండల కేంద్రంలో ఈనెల 7న జరగాల్సిన వారపు సంత తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు తహసిల్దార్ మాణిక్యం, ఎంపీడీవో ఏ వివి. కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అనంతగిరి మండలం మీదుగా డుంబ్రిగూడ మండలంలో పర్యటన ఉన్నందున వారపు సంతను రద్దు చేయడం జరిగిందన్నారు.చిరు వ్యాపారస్తులు. కిరాణా దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేయాలని నోటీసులు జారీ చేశామని తెలిపారు. సంత నిర్వహించడంతో వాహనాల రద్దీ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంత రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు.

జోరుగా అక్రమ కట్టడాలు

పట్టించుకోని అధికారులు

శరవేగంగా జరుగుతున్న అక్రమ కట్టడాలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అరకులోయ మండలం సుంకరమెట్ట పంచాయతీ కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం పక్కన వారపు సంత జరిగే ప్రభుత్వ స్థలంలో వైసిపి మాజీ నేత అండదండలతో గిరిజనేతరుడు పంచాయితీ, రెవెన్యూ అనుమతి లేకుండా జోరుగా అక్రమ కట్టడాలు సాగిస్తున్నారు. 5వ షెడ్యూల్ ప్రాంతంలో 1/70 చట్టం అమలులో ఉండగా గ్రామసభ, పేసా చట్టం అనుమతి లేకుండా గిరిజనునేతరులు ఎలా కడతారని స్థానిక గిరిజనులు మండిపడుతున్నారు.గిరిజనులు చిన్న దుకాణం వేస్తే ఆగమేగాలపై తొలగించే రెవిన్యూ అధికారులు ప్రభుత్వ స్థలంలో గిరిజనేతరులు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలు కనబడ లేదా అని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. గిరిజన హక్కులు, చట్టాలు కోసం మాట్లాడే నాయకులే గిరిజనేతరులతో చేతులు కలిపి వారికి కొమ్ముకాస్తూ అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్నారని గిరిజనులు, ఆదివాసి గిరిజన ప్రజా సంఘాలు మండి పడుతున్నారు.పంచాయితీ అధికారులు హడావిడిగా వెళ్లి పనులు ఆపాలని నోటీసు ఇచ్చినపటికి వాటిని బేఖాతరు చేస్తూ అక్రమ కట్టడాలు శరవేగంగా సాగిస్తున్నారు.అక్రమ కట్టడాలు నిలుపుదల చేయాలని సిపిఎం,ఆదివాసి గిరిజన సంఘం నాయకులు మండల తహసిల్దార్‌కు పిర్యాదు చేసి వారం రోజులు కావస్తున్నా పరిస్థితి మారలేదు. తక్షణమే ప్రభుత్వ స్థలంలో గిరిజనేతరుడు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ స్పందించి నిలుపుదల చేయాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని ఆదివాసి గిరిజన సంఘం, గిరిజనులు తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధిలో బైక్, ఆటో ఢీ కొన్న ఘటనలో వ్యక్తి దుర్మరణం చెందాడు. ఆదివారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. ఎదురెదురుగా ఆటో, బైక్ ఢీ కొన్న ఘటనలో బైకిస్టు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలంలో చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియవలసి ఉంది. మృతదేహాన్ని పోలీసులు ఎస్కోట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని భార్యను చంపిన భర్త

ప్రజాశక్తి - దేవీపట్నం : మద్యానికి డబ్బులు ఇవ్వలేదని భార్యను ఒక వ్యక్తి హత్య చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది, ఆదివారం దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ తెలిపిన వివరాలు ప్రకారం, పాముగండి గ్రామానికి చెందిన కోసు గంగన్న దొర, కోసు పాపయమ్మ భార్యాభర్తలు. వీరికి ఇద్దరి పిల్లలున్నారు. మద్యానికి అలవాటు పడిన గంగన్న దొర తరుచూ డబ్బులు ఇవ్వాలని భార్యను వేధించేవాడు. ఈ క్రమంలో మందు తాగేందుకు డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో భార్యను కర్రతో గట్టిగా కొట్టి, గొంతు నులిమి చంపేశాడని ఎస్ఐ తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, వివరాలు సేకరించినట్లు తెలిపారు.

గంజాయితో ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అచ్చుతాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు కిలోల గంజాయితో ఐదుగురు వ్యక్తులను ఆదివారం పట్టుకుని అరెస్టు చేసినటు సిఐ నమ్మి గణేష్ తెలిపారు.వివరాలివి. గంజాయిని తెచ్చుకుని నిల్వ ఉంచుకుని తాగుతున్నారన్న సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడి చేయగా, ఐదుగురు వ్యక్తుల వద్ద రెండు కేజీల గంజాయి పట్టుబడిందన్నారు నిందితులు చింతగుంట పవన్, పప్పల సాయికుమార్, పోలవరపు వేణు, బెల్లంకొండ మహేంద్ర వర్మ, అప్పికొండ మణికంఠ భానుల నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. గంజాయి అక్రమ వ్యవహారంలో మిగిలిన వ్యక్తులను గుర్తించి త్వరలో అరెస్టు చేస్తామని సిఐ తెలిపారు.

వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

ప్రజాశక్తి-యంత్రాంగం

చింతపల్లి: సీతారాముల కళ్యాణం మహోత్సవాన్ని కొమ్మంగి గ్రామంలో అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. వేద పండితుల సమక్షంలో సీతారాములను పెళ్లిపీటలపై ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నాగలి వెంకట్రావు, చల్లంగి బాలసుందర్రావు, గసాడి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

గూడెం కొత్త వీధి: మండలంలో పెదవలస పంచాయతీ రంపుల గ్రామంలో శ్రీరామనవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో అతి వైభవంగా నిర్వహించారు. వైసిపి మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్ వేడుకలలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలో చాపరాతిపాలెం, పెదవలస, గూడెం కొత్త వీధి, మొండిగడ్డ లక్కవరపేట, దామనపల్లి, పెద్ద జడమూరు, మాడెం, కొత్తపాలెం, జర్రెల గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

రాజవొమ్మంగి: స్థానిక కమ్మరపేటలోని పురాతన రామాలయం, గాంధీ బొమ్మ సెంటర్ శ్రీరామనగర్, లాగరాయి, జడ్డంగి చెరుకుంపాలెం, వాతంగి, కిర్రాబు, కింద్ర తదితర గ్రామాల్లో రామ కోవెలల వద్ద శ్రీరామనవమి వేడుకలు, రాములోరి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఆలయాల వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

కొయ్యూరు : మండల కేంద్రంలోని రాజేంద్రపాలెంలో శ్రీరామనవమి వేడుకల్లో భారీ అన్న సమారాధన నిర్వహించారు. కాకరపాడు గ్రామంలో 86 ఏళ్లుగా జలుమూరి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీసీతారామ కల్యాణోత్సవం కనులపండువగా సాగింది. వరుపుల వెంకటేష్ దంపతులు, చిటికెల విజయ దంపతులు ఆధ్వర్యంలో రాములోరి కల్యాణం జరిపించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.కార్యక్రమాన్ని జలుమూరు అప్పారావు గారి కుమారులు కుమార్తెలు నాగేశ్వరరావు,చంద్ర శేఖర్ ,గణబాబు,వెంకట గిరిబాబు, గోవిందరావు, పద్మావతి, రవణమ్మ, మంగమ్మ మనుమలు, మనవరాళ్లు మిగతా కుటుంబ సభ్యులు పర్యవేక్షించారు. సోమవారం నుంచి వారం రోజులపాటు తీర్థం నిర్వహించనున్నట్లు జలుమూరి కుటుంబసభ్యులు తెలిపారు ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని కోరారు.

గంగవరం : మండల కేంద్రంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. మోహనాపురం గ్రామంలో తొమ్మిది రోజులపాటు శ్రీరామనవమి వేడుకలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గంగవరం (సర్పంచ్ కలుముల అక్కమ్మ, వైఎస్ సర్పంచ్ గిరిబాబు, వెటర్నరీ అధికారి కె లక్ష్మణరావు, పరిశిక రాంబాబు, కత్రం సూరిబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరామగిరిలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

సీలేరు: జీకే వీధి మండలం సీలేరు దారకొండ దుప్పులవాడ పంచాయతీ వలసగెడ్డ రామాలయాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించారు బెల్లం పానకాన్ని, ప్రసాద వితరణ చేశారు అన్నసమారాధన నిర్వహించారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేశాయి.

విఆర్ పురం: శ్రీరామగిరిలో గ్రామపెద్దలు, పంచాయతీ పాలకమండలి ఆధ్వర్యంలో రామాలయంలో ఆలయ చైర్మన్ పెందుర్తి సుదర్శన్ స్వామి కల్యాణం నిర్వహించారు కార్యక్రమంలో ఐటిడిఏ పిఓ అపూర్వ భారత్, ఎంపిపి కారం లక్ష్మి స్థానిక సర్పంచ్ పులి సంతోష్‌కుమార్, మాజీ ఉప సర్పంచ్ జి. లక్ష్మణరావు, ఒఎస్‌డి జగదీష్ హడహళ్లి, ఇఓ గండి వెంకట లక్ష్మీకుమార్ ఎఎస్‌డిఎస్ సంస్థ అధ్యక్షులు వి.గాంధీబాబు జూనియర్ అసిస్టెంట్ సాయిబాబు, సిఐలు దుర్గ ప్రసాద్ కన్నప రాజు, కూనవరం వీఆర్.పురం ఎస్ఐలు సంతోష్ కుమార్, జెడ్‌పిటిసి జెడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, సిపిఎం శ్రీరామగిరి శాఖ కార్యదర్శి ఆత్మకూరు. కాంతారావు, టిడిపి మండల అధ్యక్షులు ఆచంట శ్రీను, సిపిఎం మండల సభ్యులు గుండెపుడి. లక్ష్మణరావు, ఎస్‌డిఎస్‌లు వీ గాంధీబాబు, తెలుగు రైతు అరకు పార్లమెంటు అధ్యక్షులు కోట్ల బాలయ్య, జనసేన మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ మండల కార్యదర్శి మోహన్ రెడ్డి, ఆలయ వైస్‌చైర్మన్ వాగుల అంజన రావు, బాగుల ప్రమీల, పెట్టా నాగేంద్ర, ముత్యాల జలబాబు, రేవు సింహాచలం మాజీ జెడ్‌పిటిసి ముత్యాల రామారావు, తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు ఆకోజు భాగ్యలక్ష్మి, టిడిపి నాయకులు సవలం రాజేంద్రప్రసాద్, వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షులు బీరక సూర్యప్రకాశరావు, ఉపసర్పంచ్ ముత్యాల చంద్రశేఖర్, ఐటిడిపి మండల కన్వీనర్ ముత్యాల సిద్ధార్థ, కోడిసెల దుర్గారావుచ ఆత్మకూరు కాంతారావు, ఆలయ కమిటీ సభ్యులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సూర్య నమస్కారాల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

మహా సూర్యవందనానికి ఏర్పాట్లు పూర్తి

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురష్కరించుకుని జిల్లా నుండి ప్రపంచ రికార్డ్ దిశగా 108 సూర్య నమస్కారాలు కార్యక్రమాన్ని 20 వేల మంది విధ్యార్ధులతో అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న విషయం విదితమే.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదివారం ఆ ప్రాంగణాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహా సూర్య వందనం ఏర్పాట్లు పూర్తయ్యాయని, విద్యార్ధులను వివిధ పాఠశాల వసతి గృహాల నుండి బస్సులలో తరలించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమానికి సుమారు 200 మంది పిడిలు, ఉపాధ్యాయుల సేవలను వినియోగిస్తున్నామని చెప్పారు. ఆహారం,మంచి నీరు, వైద్య సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసి అభిషేక్ గౌడ, ఎస్పీ అమిత్ బర్ధర్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, ఎఎస్పీ ధీరజ్ తదితరులు మైదానాన్ని పరిశీలించారు.

కెజిహెచ్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్

- ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ బివి.రమణ వెల్లడి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా గుర్తింపు పొందిన కెజిహెచ్‌లో అన్ని విభాగాల పరిపాలనను గాడిలో పెట్టేందుకు త్వరలోనే కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు కెజిహెచ్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన అడ్మినిస్ట్రేటర్ పోస్టులో ఇటీవల నియమితులైన డిప్యూటీ కలెక్టర్ బివి.రమణ అన్నారు. ఆయన 'ప్రజాశక్తి'తో ముచ్చటిస్తూ పలు విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

కెజిహెచ్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చింది ?

కెజిహెచ్‌లో పరిపాలనా పరంగా అనేక ఇబ్బందులు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. ఇటీవల విశాఖ జిల్లా పర్యటనకు వచ్చిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి కెజిహెచ్‌లోని రోగులకు అందించే సేవలు, భద్రత విషయాలపై జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చితో సమీక్షించారు. ఈ నేపథ్యంలో ఇన్‌ఛార్జి మంత్రి ఆదేశాల మేరకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. త్వరలోనే ఇది అమల్లోకి వస్తుంది.

కమాండ్ కంట్రోల్ సెంటర్ వల్ల ప్రయోజనం ఏంటి ?

కెజిహెచ్‌కు వస్తున్న రోగులు, వారి సహాయకులు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందివ్వడం కోసం, అలాగే తగిన మౌలిక సదుపాయాలను కల్పించడం కోసం, పటిష్ట చర్యలు తీసుకోవడం కోసం ఈ సెంటర్ దోహదపడుతుంది.

కెజిహెచ్‌లో పసిపిల్లల అపహరణ వంటి దుశ్చర్యలు ఇటీవల జరగడానికి కారణాలేంటి ?

గతంలో తల్లి చెంతన ఉన్న శిశువును అపహరించారు. ఇటీవల శిశువులు తారుమారు అయ్యారు. దీనికి ప్రధాన కారణం తగిన నిఘా లేకపోవడం. అలాగే కొన్ని దొంగతనాలు కూడా చోటు చేసుకున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని 220 సిసి కెమెరాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. అన్ని వార్డులలో, రద్దీ ప్రాంతాలలో, సిఎస్ఆర్ బ్లాక్, సూపర్ స్పెషాలిటీ విభాగాలు, కార్యాలయ ఆవరణ, నర్సింగ్ సెక్షన్ వంటి ప్రాంతాల్లో నిఘాను పటిష్టం చేయడం కోసం వీటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

కెజిహెచ్ లో ఫైళ్ల క్లియరెన్స్ ఎలా ఉంది ?

ఈ సమస్యను పరిష్కరించడంలో భాగంగా పక్కాగా ఈ- ఆఫీసు అమలు చేయడానికి నిర్ణయించాం. కోర్టు కేసులకు సంబంధించిన ఫైళ్లు మినహా మిగిలిన అన్ని ఫైళ్లను విధిగా ఈ-ఆఫీసులో పెట్టడం జరుగుతుంది.

పరిపాలనా విభాగం పరిస్థితి ఏంటి ?

కెజిహెచ్ పరిపాలనా విభాగంలోని హెచ్ఆర్ విభాగాన్ని ఇక్కడి నుంచి వేరు చేసి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ పరిధికి విలీనం చేయనున్నాం.

జనన, మరణ ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యంపై ఏమంటారు?

ఇందులో కొంత వాస్తవం లేకపోలేదు. ఈ జాప్యాన్ని నివారించడానికి, ఆధునిక విధానాన్ని అమలు చేస్తున్నాం.

సెక్యూరిటీ అమలులో లోపాలున్నాయన్న విమర్శలపై ఏమంటారు ?

ఈ సమస్యను పరిష్కరించడం కోసం పోలీస్ పోస్టు, అవుట్ పోస్టులను పటిష్టంగా అమలు చేస్తాం. సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్యను పెంచడం ద్వారా, పరిష్కారానికి మార్గం ఉంటుంది. అలాగే శానిటేషన్‌పై కూడా ప్రత్యేకమైన దృష్టి సారిస్తాం.

'దమ్ము మీదే.. స్టార్ మీరే' టివిసి ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఐటిసి బ్రాండ్ తన ప్రాంతీయ ప్రచారంలో భాగంగా దమ్ముమీదే, స్టార్ మీరే అంటూ కొత్త వాణిజ్య ప్రకటన (టివిసి)ను విశాఖ నగరంలో ఆదివారం ప్రారంభించింది. ఈ సందర్భంగా ఐటిసి స్పైసెస్ విభాగం కో-ఆర్డినేటర్ పియూష్ మిశ్రా మీడియాతో మాట్లాడుతూ ఐటిసి లిమిటెడ్ ఆశీర్వాద్ మసాలాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి తమ బ్రాండ్ అంబాసిడర్‌గా టాలీవుడ్ నేచురల్ స్టార్ నానిని ఎంచుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అన్ని నగరాలలో టివిసి ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా విశాఖ నగరంలో కూడా ప్రచార కార్యక్రమం జరిగిందన్నారు. దీనికి విశేష స్పందన లభించిందని తెలిపారు. తరతరాలుగా తెలుగు వంటకాలు ఆకర్షణీయమైన రుచులు, సుగంధ ద్రవ్యాలు సిగ్నేచర్ 'తెలుగు కారం'తో వృద్ధి చెందాయని, తమ విస్తృత శ్రేణి అధిక నాణ్యత, ప్రామాణికమైన మసాలాల ద్వారా ఈ పాకశాస్త్ర వారసత్వాన్ని ఆశీర్వాద్ మసాలా గౌరవిస్తుందని అన్నారు.

ఏదయా మీ దయ..!

తాగునీటికి ప్రజల అవస్థలు - స్వయంభూవరంపై ముఖం చాటేసిన ఎన్‌టిపిసి
సిఎస్ఆర్ నిధులతో ఆర్ఓ ప్లాంట్ పెట్టేందుకు విముఖత


స్వయంభూవరానికి ఆనుకుని ఉన్న ఎన్‌టిపిసి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

రెండు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను నెలకొల్పిన నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టిపిసి) ప్లాంట్ కాలుష్యంతో తాగునీటికి ఇబ్బందిపడుతున్న స్వయంభూవరం ప్రజలపై కనీస జాలి చూపడంలేదు. పశువులను కడగడానికి కూడా వినియోగించడానికి పనికిరాని విధంగా బోర్లు, బావుల నీరు ఇక్కడ కలుషితమైంది. ఎన్‌టిపిసికి ఆనుకొని పరవాడ మండలం, కలపాక పంచాయతీ స్వయంభూవరం వుంది. ప్రభుత్వరంగ సంస్థ ఎన్‌టిపిసి వస్తుందంటే ఉపాధి దొరుకుతుందని ప్రజలు భావించి నాడు భూములిచ్చారు. ఆ ఉపాధి లేకపోగా వ్యవసాయం చేసుకొని బతికే బతుకు ఛిద్రమైంది. తీవ్రమైన కాలుష్యంతో బాధపడుతున్న స్వయంభూవరం ప్రజలు గ్రామాన్ని తరలించి తమ ప్రాణాలు కాపాడాలని ఎంతోకాలంగా కోరుతున్నారు. ఎన్‌టిపిసి కూలింగ్ టవర్ల నుంచి వచ్చే ఉప్పు తుంపర్లతో ఇళ్లు దెబ్బతింటున్నాయి. పంటలు పండడంలేదు. జనం వివిధ వ్యాధులతో బాధపడుతున్నారు. ఊరులో తాగునీరు లేక, వెన్నెలపాలెం నుంచి నీరు సక్రమంగా సరఫరాకాక వెన్నెలపాలెంలో నీటి టిన్నులు కొనుక్కొని కాలం గడపాల్సిన దుస్థితి ఆ గ్రామానికి ఎదురైంది. బూడిద, కూలింగ్ టవర్ల నుంచి వస్తున్న ఉప్పు నీటితో ఊర్లో వుండలేక, వూరు విడిచివెళ్లలేక మధ్యలో నలిగిపోతున్నారు.

ప్రభుత్వాలు, ఎంపీ, ఎమ్మెల్యేలు ఎంతమంది మారినా వారి కష్టాలు పోలేదు. బొగ్గు వినియోగంలో విడులయ్యే మెర్క్యురీ, ఆర్సినిక్, కాడ్మియం, లెడ్ వంటి వాటితో ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. అయినా, ఈ గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పించడానికి ఎన్‌టిపిసి ముందుకురావడంలేదు. స్వయంభూవరంలో ఎన్‌టిపిసి కాలుష్య సమస్య వుందని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఇటీవల గుర్తించారు. సిఎస్ఆర్ నిధులతో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఎన్‌టిపిసి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కానీ సిఎస్ఆర్ నిధులతో తాగునీటి సౌకర్యం కల్పించడానికి సానుకూలత చూపలేదు. వాస్తవానికి పరిశ్రమ ప్రభావిత గ్రామాల్లో తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కింద నిధులు కేటాయించి ఖర్చు చేయాలి. కానీ తాగునీటికి అనేక అవస్థలు పడుతున్న స్వయంభూవరంలో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటుకు ఎన్‌టిపిసి నిధులు ఇవ్వడంలేదు. స్థానికులు కూడా అనేకసార్లు తాగునీటి సమస్యను అధికారులకు తెలిపారు. ప్రజా ప్రతినిధుల చెప్పిన చోట సిఎస్ఆర్ నిధులు ఖర్చుచేసే ఎన్‌టిపిసి స్వయంభూవరంపై కక్షకట్టినట్లు వ్యవహరిస్తోంది. ఎంపీ, ఎమ్మెల్యేలు కూడా అలాగే వున్నారు. స్వయంభూవరంలో తాగునీటికి నిధులు ఖర్చు చేయడంలేదు.

సిపిఎం నిర్వహించిన ప్రజా చైతన్యయాత్రలో ఎన్‌టిపిసి కాలుష్య తీవ్రతను స్వయంభూవరం, సోమినాయుడుపాలెం ప్రజలు ఆ పార్టీ నాయకులకు వివరించారు. స్వయంగా ప్రజల బాధలను చూసిన నాయకులు ఆ రెండు గ్రామాలను తక్షణమే తరలించాలని, అంతవరకు తాగునీటి సౌకర్యం కల్పించాలని పరవాడ తహశీల్దార్ కార్యాలయం వద్ద బాధితులతో ధర్నా నిర్వహించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పందించి గ్రామాన్ని సందర్శించి, సిఎస్ఆర్ నిధులతో తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎన్‌టిపిసి అధికారులను కోరినా వారి నుంచి సానుకూల స్పందన కరువైనట్లు తెలిసింది.

సమస్యలపై ఇటీవల ఆందోళనకు దిగిన స్వయంభూవరం గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

35 ఏళ్ళ తరువాత కుటుంబం చెంతకు..

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాంచీకి చెందిన దశరథ్ అనే వ్యక్తి మానసిక వ్యాధితో కుటుంబానికి దూరమై 35 సంవత్సరాల తర్వాత విశాఖకు చెందిన ఎయుటిడి స్వచ్ఛంద సంస్థ కృషి ఫలితంగా కుటుంబ సభ్యుల చెంతకు చేరుకున్న సంఘటన ఇది. ఎయుటిడి కార్యదర్శి ప్రగడ వాసు ఆదివారం మీడియాకు తెలిపిన సమాచారం ప్రకారం.. నలుగురు అన్నదమ్ములలో పెద్దవాడు దశరథ్. ఆయనకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. అనుకోకుండా విచిత్రమైన మానసిక వ్యాధికి గురయ్యాడు. వ్యాధికి ముందు చెప్పులు దుకాణం చక్కగా నడుపుకుని బతికేవాడు. వ్యాధి వచ్చాక రాంచీ హాస్పిటల్లో వైద్యం అందించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. బాల్యదశలోని పిల్లలను వదిలిపెట్టి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దశరథ్‌ను ఎయుటిడి సిబ్బంది 2019 సెప్టెంబర్‌లో రెస్క్యూ చేసి ఐదేళ్ళపాటు షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు.

పలుమార్లు ప్రభుత్వ మానసిక వైద్యశాలలో చేర్పించి చికిత్స అందించారు. అంచెలంచెలుగా ఆయన కోలుకున్నారు. శ్రద్ధా సహకారంతో దశరథ్‌ను బీహార్ రాష్ట్రం, రోహితాస్ జిల్లాలోని దరిహత్ గ్రామంలో ఉంటున్న కొడుకు సంజయ్ కుమార్, కోడలు పూజిత దేవిలకు క్షేమంగా అప్పగించారు. పేషెంట్ రూపం మారినప్పటికీ అతని పేరుతో గ్రామస్తులు గుర్తుపట్టినట్లు వాసు తెలిపారు.

మిట్టల్ ప్లాంట్‌లో 20 వేల ఉద్యోగాలొస్తే..

విశాఖ ఉక్కులో తొలగింపులు ఎందుకు ?

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నక్కపల్లి వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న మిట్టల్ స్టీల్ ప్లాంట్‌లో 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యానికి 20 వేల ఉద్యోగాలు వస్తాయని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగులను ఎందుకు తొలగిస్తోందో చెప్పాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్న మిట్టల్ స్టీల్ ప్లాంట్‌లో 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యానికి 20 వేలు ఉద్యోగాలు కల్పించడం వాస్తవమైతే, అదే సామర్థ్యంతో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించబడి, పాత సాంకేతిక పరిజ్ఞానంతో నడుస్తున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తికి 22 వేల మంది మాత్రమే కార్మికులు ఉన్నారని, మరి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారని రెండు వేల మందికిపైగా పర్మనెంట్ కార్మికులను, ఐదువేల మందికిపైగా కాంటాక్ట్ కార్మికులను తొలగించడం ఎందుకని ప్రశ్నించారు. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉందని దుష్ప్రచారం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. నీరు, విద్యుత్ వంటి విషయాల్లో రాయితీలు ప్రకటించి మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు లాభం చేకూరుస్తున్నారన్నారు. అదే సమయంలో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు ప్రధానమైన రా మెటీరియల్‌ను వివిధ దేశాల నుంచి తెచ్చుకునేందుకు, చేసిన ఉత్పత్తులను వివిధ దేశాలలో అమ్ముకునేందుకు అవసరమైన గంగవరం పోర్టును ప్రైవేటు వారికి అప్పగించి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు మొండి చేయి చూపించి నష్టాలపాలు చేస్తున్నారన్నారు. తాజాగా నక్కపల్లిలో మిట్టల్ ఏర్పాటు చేస్తున్న స్టీల్ ప్లాంట్ కోసం పోర్టు ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం ప్రైవేట్ వారికి లాభాలు చేకూర్చేందుకేనని కుమార్ అన్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌పై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆపి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు. స్టీల్ ప్లాంట్‌లో అక్రమంగా తొలగిస్తున్న కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేటికీ ఎనిమిది వేల మంది నిర్వాసితులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకుని వారందరికీ ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో 5500 ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయని ప్రకటించినందున ఆ ఖాళీలను నిర్వాసితులు, నిరుద్యోగ యువతతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బొకారోలో జరిగినటువంటి నిర్వాసిత ఉద్యమాలు విశాఖపట్నంలో కూడా తలెత్తే ప్రమాదం ఉందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు స్టీల్ యాజమాన్యం, స్టీల్ మంత్రిత్వ శాఖ చేస్తున్న దుర్మార్గాలకు అడ్డుకట్టు వేసి కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యోగాలను తొలగించకుండా, వారి కుటుంబాలను ఆదుకునే విధంగా తగు చర్యలు చేపట్టడం ద్వారా నిరవధిక సమ్మెను నివారించాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ ఆత్మహత్య

ప్రశాంత్ కుమార్ మృతదేహం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌లో విధులు నిర్వహిస్తున్న థియేటర్ అసిస్టెంట్ ప్రశాంత్ కుమార్ ఆదివారం విధులు నిర్వహిస్తున్న ప్రదేశంలోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కెజిహెచ్‌లో కలకలం సృష్టించింది. ప్రేమ వ్యవహారంతో పాటు పలు కారణాలు ఆయన ఆత్మహత్యతో ముడిపడి ఉన్నాయని తెలిపారు. విషయం తెలియడంతో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కెజిహెచ్ ఆర్ఎంఓ ఆయన వెంట ఉన్నారు. అప్పటికే మృతుని కుటుంబీకులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగిస్తామని అధికారులు తెలిపారు. అయితే సాయంత్రం అయినప్పటికీ మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించలేదు. దీనికి కారణం పోలీసుల పంచనామా పూర్తి కాకపోవడమేనని తెలిపారు. వన్ టౌన్ పోలీసుల నిర్లక్ష్య వైఖరి అందుకు కారణమని మృతుని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రిలో విధుల్లో ఉండగా ఉద్యోగి మరణించినా, పోస్టుమార్టం విషయంలో ఆసుపత్రి అధికారులు సహకరించలేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. కుటుంబీకులతో పాటు తోటి ఉద్యోగులు మార్చురీ వద్ద పడిగాపులు కాశారు.